# కరెంట్ అఫైర్స్

## ఆస్కార్ పోటీకి 'విలేజ్ రాక్‌స్టార్స్'

- ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల పోటీకి భారత అధికారిక ఎంట్రీగా అస్సామీ చిత్రం 'విలేజ్ రాక్‌స్టార్స్' ఎంపికైంది. 2019, ఫిబ్రవరిలో జరిగే ఆస్కార్ వేడుకలో ఉత్తమ విదేశీ భాషా చిత్రం విభాగంలో ఈ చిత్రం పోటీపడనుంది.
- బాలీవుడ్ చిత్రాలు పద్మావత్, రాజీ, ప్యాడ్‌మ్యాన్, హిచ్కీ, 102 నాటవుట్, తెలుగు చిత్రం మహానటితో పోటీపడి 'విలేజ్ రాక్‌స్టార్స్' ఈ అవకాశం దక్కించుకుంది. ఈ చిత్రానికి దర్శకురాలు రీమాదాస్ రచయిత, నిర్మాత, ఛాయాగ్రహకురాలిగా వ్యవహరించారు.
- అసోంలోని ఓ కుగ్రామంలో అతి తక్కువ బడ్జెట్‌తో నటనతో ఏ మాత్రం పరిచయం లేని వారితో తెరకెక్కించిన ఈ చిత్రం ఈ ఏడాది జాతీయ ఉత్తమ చిత్రంగా పురస్కారం అందుకుంది.

## సిక్కిం తొలి విమానాశ్రయం

- సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌కు సమీపంలోని పాక్యోంగ్‌లో నిర్మించిన సిక్కిం తొలి విమానాశ్రయాన్ని 2018, సెప్టెంబరు 24న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కొత్తగా ప్రారంభించిన పాక్యోంగ్ ఎయిర్‌పోర్ట్‌తో దేశంలో విమానాశ్రయాల సంఖ్య 100కు చేరింది.
- చైనా సరిహద్దుకు 60 కి.మీ. దూరంలో, సముద్ర మట్టానికి 4500 అడుగుల ఎత్తులో ఉన్న పాక్యోంగ్‌లోని కొండపై 201 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన దీన్ని గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంగా పరిగణిస్తున్నారు.
- 2009లో ఈ విమానాశ్రయ నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.605 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించారు.

## అమృత్‌లో తెలుగు రాష్ట్రాల ముందంజ

- కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అమృత్ పథకం అమలులో జాతీయ స్థాయిలో 65.24 శాతంతో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానంలో నిలిచింది. 59.17 శాతంతో ఒడిశా, 54.32 శాతంతో మధ్యప్రదేశ్, 52.39 శాతంతో తెలంగాణ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- నగరాల్లో మంచి నీటి సరఫరా, మురుగు నీరు, వరద నీటి పారుదల, పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త సేకరణ తదితర పనులు సమర్థంగా నిర్వహించేందుకు 2015, జూన్ 25న కేంద్రం అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది.
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొదటి మూడు సంవత్సరాల్లో పథకం అమలును సమీక్షించిన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ 2018, సెప్టెంబరు 24న ఈ ర్యాంకులు ప్రకటించింది.
- అమృత్ పథకంలో ఆంధ్రప్రదేశ్ నుంచి కాకినాడ, విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ; తెలంగాణ నుంచి వరంగల్, కరీంనగర్, హైదరాబాద్‌లు ఎంపికయ్యాయి.

## మాల్దీవుల అధ్యక్షుడు సోలిహ్

- 2018, సెప్టెంబరు 23న జరిగిన మాల్దీవుల అధ్యక్ష ఎన్నికల్లో ప్రతిపక్షనేత ఇబ్రహీం మహ్మద్ సోలిహ్ ఘన విజయం సాధించారు. ప్రతిపక్షాల కూటమి తరపున పోటీ చేసిన మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండీపీ) అభ్యర్థి ఇబ్రహీం, ప్రస్తుత అధ్యక్షుడు, భారత విరోధిగా పేరు ఉన్న అబ్దుల్లా యమీన్‌పై గెలిచారు.

## ఐరాస జనరల్ అసెంబ్లీ 73వ సమావేశం

- ఐరాస సాధారణ సభ (జనరల్ అసెంబ్లీ) 73వ సమావేశాన్ని 2018, సెప్టెంబరు 25న న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సమితిలోని 193 దేశాల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచం విశ్వసనీయత లోపంతో బాధపడుతోందని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. భారత్ సహా పలు అంతర్జాతీయ అంశాలను ప్రస్తావించారు.

- అత్యంత చిన్నవయసులో న్యూజిలాండ్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జెసిండా ఆర్డెర్న్ తన మూడు నెలల పాపతో సభకు హాజరై చరిత్ర సృష్టించారు. ఇలా పసిపాపతో కలిసి ఒక మహిళా దేశాధినేత ఐరాస అసెంబ్లీ హాల్‌లోకి అడుగు పెట్టడం ఇదే తొలిసారి.

### ఐరాసలో చంద్రబాబు

- 2018, సెప్టెంబరు 25న ఐరాస ప్రధాన కార్యాలయంలో 'సుస్థిర సేద్యానికి ఆర్థిక చేయూత - అంతర్జాతీయ సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకోపన్యాసం చేశారు. ప్రకృతి సేద్యం ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పారు.

### ఆయుష్మాన్ భారత్

- దేశంలోని పేదలకు రూ.5 లక్షల ఆరోగ్య బీమాను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'ఆయుష్మాన్ భారత్' (ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన – పీఎంజేఏవై) పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2018, సెప్టెంబరు 23న ఝార్ఖండ్ రాజధాని రాంచీలో ప్రారంభించారు.
- ఈ పథకం కింద ఒక కుటుంబానికి ఏటా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా లభిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో 8.03, పట్టణ ప్రాంతాల్లోని 2.33 కోట్ల కుటుంబాలకు చెందిన దాదాపు 50 కోట్ల మంది ఈ పథకం కింద లబ్ధి పొందుతారు. పథకంలో కుటుంబ సభ్యుల సంఖ్య, వారి వయసులపై పరిమితిలేదు.
- గుండె, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు, మధుమేహం సహా 1300 పైగా రుగ్మతలకు ఈ పథకం కింద చికిత్స లభిస్తుంది.
- పథకం అమలును పర్యవేక్షించే నేషనల్ హెల్త్ ఏజెన్సీ (ఎన్‌హెచ్ఏ) mera.pmjay.gov.in వెబ్‌సైట్‌ను, 14555 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది.
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమం అయిన ఈ పథకం కోసం తెలంగాణ, ఒడిశా, దిల్లీ, కేరళ, పంజాబ్‌లు కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోలేదు. పథకంలో కేంద్రం, రాష్ట్రాల వాటా 60 – 40% నుంచి 90 – 10% వరకూ ఉంటుంది.

### ఆసియా కప్ మనదే

- ఆసియా కప్ క్రికెట్ టోర్నీ – 2018 విజేతగా టీమిండియా నిలిచింది. సెప్టెంబరు 28న దుబాయ్‌లో జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.
- ఫైనల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా లిటన్ దాస్ (బంగ్లాదేశ్), మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ (భారత్) ఎంపికయ్యారు. భారత్ ఆసియా కప్ విజేతగా నిలవడం ఇది ఏడోసారి. ఈ టోర్నీలో టీమిండియాకు కెప్టెన్‌గా రోహిత్ శర్మ వ్యవహరించాడు.
- అంతర్జాతీయ క్రికెట్‌లో 800 ఔట్‌లలో పాలుపంచుకున్న మూడో వికెట్ కీపర్‌గా, ఆసియా నుంచి తొలి కీపర్‌గా ఎం.ఎస్. ధోని ఈ ఫైనల్ మ్యాచ్‌లో మొర్తజాను స్టంపౌట్ చేసి ఈ ఘనత సాధించాడు.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**